www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 5 మే 2025

రైతులకు అధికారుల సూచనలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

రైతులకు ముఖ్యంగా వరికోతలు చేస్తున్న వారు ప్రస్తుత వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకొని పలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని వెనువెంటనే సురక్షిత ప్రదేశానికి తరలించాలని సూచించారు. ఇప్పటివరకు జిల్లాలో 87 శాతం వరి కోతలు పూర్తి చేశారని, 13 శాతం కోతలకు సిద్ధంగా ఉందని తెలిపారు. మిగిలిన విస్తీర్ణంలో వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా తాత్కాలికంగా నిలిపివేయాలని కోరారు. గోపాలపురం, తాళ్లపూడి, రంగంపేట, కడియం మండలాల్లో ఇంకా 25 నుండి 30 శాతం వరకు అధిక విస్తీర్ణంలో కోతలకు సిద్ధంగా ఉన్న వారిని కోయడం నిలుపుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

అకాల వర్షం.. అపార నష్టం..

- జిల్లావ్యాప్తంగా కుండపోత వర్షం
- కళ్లాల్లో తడిసిపోయిన ధాన్యం, మొక్కజొన్న

గోపాలపురం మండలం చిట్యాలలో ఆరబెట్టిన ధాన్యం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో అకాల వర్షాలు, ఈదురుగాలులు అన్నదాతల ఆశలను ఆవిరి చేశాయి. ధాన్యం రైతులకు నిరాశ మిగిల్చాయి. గత రెండ్రోజులుగా వాతావరణం ఒక్కసారిగా మారిన విషయం విదితమే. జిల్లాలోని పలు మండలాల పరిధిలో ఈదురుగాలులు, విస్తారంగా వర్షాలు కురిశాయి. ఆదివారం తెల్లవారుజాము నుంచి జిల్లావ్యాప్తంగా కురిసిన అకాల వర్షాలు రైతులను అతలాకుతలం చేశాయి. జిల్లావ్యాప్తంగా ఈ సీజన్‌లో 1.46 లక్షల ఎకరాల్లో వరిసాగు చేయగా ప్రస్తుతం 1.25 లక్షల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంట సరిగా చేతికివచ్చిన సమయంలో ధాన్యం నీటిపాలు కావడంతో రైతుల్లో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడుతోంది. ఈదురుగాలులకు అకాల వర్షాలకు పంటలు తీవ్రంగా దెబ్బతినడంతో రైతన్నలు నష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్నారు. సరిగా పంటలు కోతకు రావడం, ధాన్యం చేతికి అందడంతో కొనుగోలు కేంద్రాలకు తరలించే లోపే వర్షం ముంచెత్తింది. అకాల వర్షాల కారణంగా కళ్లాలలో, రైస్‌మిల్లుల వద్ద బయట ఉన్న రైతుల ధాన్యం రాశులు నీటి పాలవుతుండడంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు.

వరి కోతలను వాయిదా వేసుకోవాలి

వర్షాల నేపథ్యంలో పంటలు కోయని రైతులు వర్షాలు తగ్గేవరకూ వాయిదా వేసుకోవాలి. జిల్లాలో ప్రస్తుతానికి ఎటువంటి నష్టమూ లేదు. ఆదివారం ఉదయం కురిసిన వర్షం ఎక్కువగా ప్రభావం చూపే అవకాశం లేదు. ఆదివారం రాత్రి, సోమవారం వర్షాలు కురిస్తే ప్రభావం ఉంటుంది. ఇప్పటివరకూ జిల్లావ్యాప్తంగా 87 శాతం కోతలు పూర్తయ్యాయి. మరో 13 శాతం పెండింగ్‌లో ఉన్నాయి. కోతలు పూర్తయిన చోట 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉందని అంచనా. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ధాన్యం సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

- ఎస్.మాధవరావు వ్యవసాయ శాఖ జెడి

తడిసిన కళ్లాలలో ధాన్యం

రాష్ట్ర ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 215 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు ప్రారంభించింది. జిల్లావ్యాప్తంగా దాదాపుగా వరి కోతలు పూర్తవటంతో రైతులు పెద్దఎత్తున ధాన్యాన్ని తరలిస్తున్నారు. తేమ శాతం అధికంగా ఉందనే కారణంతో మిల్లర్లు ధాన్యం దింపుకోవడం లేదు. దీంతో రైతులు ధాన్యాన్ని రోడ్ల వెంబడి, కళ్లాల్లో కుప్పలు, కుప్పలుగా ధాన్యం రాశులను రైతులు పోసి ఆర బెట్టిన తర్వాత తరలిస్తున్నారు. ఒక్కసారిగా కురిసిన అకాల వర్షానికి ఈ ధాన్యం తడవడమే కాక కుప్పల మధ్య భారీగా వర్షపునీరు నిలిచిపోయింది. దీంతో ధాన్యం కుప్పలను ఎత్తి వర్షపునీటిని తొలగించేందుకు రైతులు నానా ఇబ్బందులూ పడ్డారు. జిల్లాలో అకాల వర్షానికి ధాన్యం తడిసింది. ప్రాథమిక పరిశీలనతో ఎటువంటి నష్టం లేదని అధికారులు అంచనా వేశారు. అయితే ఆదివారం రాత్రి కూడా వర్షం కురిస్తే నష్టం తప్పదని చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో ఇప్పటికే 3 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసినట్లు తెలుస్తోంది

రైతుల వద్ద 60,000 మెట్రిక్ టన్నుల ధాన్యం

ఆదివారం కురిసిన కుండపోత వర్షం ఉదయం 8.30 గంటల నాటికి సరాసరిన జిల్లావ్యాప్తంగా 20.0ఎంఎం వర్షపాతం నమోదైంది. రాజానగరంలో అత్యధికంగా 14.0 ఎంఎం వర్షపాతం నమోదు కాగా రంగంపేటలో అత్యల్పంగా 0.2 వర్షపాతం నమోదైంది. జిల్లాలో 1.46 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా 1.25 లక్షల ఎకరాల్లో పంట కోతలు పూర్తయ్యాయి. 87 శాతం కోతలు పూర్తికాగా 13 శాతం పెండింగ్‌లో ఉంది. ఇప్పటి వరకూ 4.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రాగా 216 రైతు సేవా కేంద్రాల ద్వారా ఇప్పటి 2,63,076 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేశారు. మరో 80 వేల మెట్రిక్ టన్నులు రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఇంకొక 60 వేల మెట్రిక్ టన్నులు ప్రస్తుతం రైతుల వద్ద కళ్లాల్లో ఉంది. ఈ ధాన్యం సురక్షిత ప్రాంతాలకు లేదా మిల్లులకు తరలించే ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టరు ప్రశాంతి అధికారులను ఆదేశించారు. కోతలు జరగాల్సిన 19 వేల ఎకరాల్లో వర్షాల నేపథ్యంలో వాయిదా వేసుకోవాలని రైతులకు సూచించారు.

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

అకాల వర్షాలు, వాతావరణ శాఖ హెచ్చరికలు నేపథ్యంలో కోతలు పూర్తి చేసిన ధాన్యం సేకరణ విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టం చేశారు. ఆదివారం జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో రబీ సీజన్ ధాన్యం కొనుగోలుపై టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ, జిల్లాలో 216 రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రస్తుత రబీ సీజన్‌లో 2 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేయాలని లక్ష్యంలో ఇప్పటి 2,63,076 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తి చేసి, లక్ష్యాలను అధిగమించినట్టు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 2,79, 689 మెట్రిక్ టన్నుల ధాన్యం కోతలు పూర్తి చేసినట్టు తెలిపారు. అనపర్తి నియోజకవర్గంలో 25,800 మెట్రిక్ టన్నుల ధాన్యం కోతలు పూర్తి కాగా 17,903 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తి చేసినట్టు తెలిపారు. గోపాలపురంలో 32,105 ఎంటిలకు, 30,038 ఎంటిలు, గోకవరం మండలంలో 8758 ఎంటిలకు 8,637 ఎంటిలు, కొవ్వూరు పరిధిలో 70,479కు 67,928 ఎంటిలు, నిడదవోలులో 89,099 ఎంటిలు, రాజమహేంద్రవరం రూరల్‌లో 14,782కు గాను 14,605 ఎంటిలు, రాజానగరం మండలంలో 38,641 మెట్రిక్ టన్నుల ధాన్యం కోతలు పూర్తయినట్టు తెలిపారు. వాటిలో 37,911 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు తెలిపారు. ఇంకా కోతలు పూర్తి చేసిన వాటిలో 16,613 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని, ప్రస్తుతం వర్షాలు కురిసే అవకాశం దృష్ట్యా తగిన సూచనలు ఇవ్వడం, మిల్లులకు తరలించడంపై దృష్టి పెట్టాల్సి ఉంటుందన్నారు.

ప్రమాదకర హోర్డింగుల విషయంలో, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ లైన్స్ విషయంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. వర్షాలు, ఈదురు గాలులు వీస్తున్న నేపథ్యంలో ఎటువంటి ప్రమాదాలూ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. నగరంలో, మున్సిపల్ పరిధిలో, మండల కేంద్రాల్లో భారీ హోర్డింగ్‌ల విషయంలో వాటి సురక్షిత, పటిష్టత విషయంలో తనిఖీలు చేయాలన్నారు. సరైన నిర్వహణ, పటిష్టత లేని వాటిని తొలగించే క్రమంలో సంయమనంతో వ్యవహరించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. నిర్దేశించిన స్నాన ఘట్టాలలో స్నానాలు చేయడం కోసం మాత్రమే అనుమతించాలని, ప్రమాద ఘటనల నేపథ్యంలో తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో హెచ్చరికలతో కూడిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. గోదావరి తీరంలో ఉన్న గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి పూర్తి అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఇటీవల గోదావరి నదిలో మునిగి మరణాలు సంభవించడం దురదష్టకరమన్నారు. అటువంటి ఘటనలు పునరావత్తం కాకుండా చూడాలన్నారు. అందుకు సంబంధించి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

లక్ష్య సాధనకు ప్రతిరూపం భగీరథుడు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

భగీరథుని జీవితం నుంచి మనం స్ఫూర్తి పొందాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పిలుపు ఇచ్చారు. ఆదివారం కలెక్టరేట్‌లో భగీరథ మహర్షి జయంతి వేడుకలలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ.. చిత్తశుద్ధి, కఠోర సాధన ద్వారానే లక్ష్యాలను సాధించ వచ్చని తెలిపారు. భగీరథుని జీవితం నుంచి ప్రతి ఒక్కరూ స్ఫూర్తి పొందాలన్న ఉద్దేశంతో ఆయన జయంతి వేడుకలను జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. సగం నీళ్ల ఉన్న గ్లాసును చూసి ... 'సగం నీళ్ళు మాత్రమే ఉన్నాయని' ప్రతికూల స్వభావం కలిగి ఉన్న వ్యక్తులు భావిస్తే, సానుకూల స్వభావం కల వారు 'గ్లాసు ఖాళీగా ఉండకుండా సగం నిండి ఉంది" అని ఆశావహ దక్పథం కలిగి ఉంటారని చెప్పారు. ఎప్పుడు సానుకూల ఆలోచనా ధోరణి కలిగి ఉంటామో, అప్పుడు అనుకూల ఫలితాలు సాధ్యం అవుతాయని పేర్కొన్నారు. బృహత్తర లక్ష్యాలను సాధించిన వారి నుంచి ప్రేరణ పొందాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు సానుకూల వైఖరి అవసరమని తద్వారా మెరుగైన ఫలితాలు సాధించడం సాధ్యం అవుతుందని ఆమె తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామ మూర్తి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కెఎన్.జ్యోతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉచిత విద్యకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఉచిత విద్యకు దరఖాస్తులు ప్రారంభం అయినట్టు జిల్లా విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులు విద్యా హక్కు చట్టంలో నిర్ధేశించిన విధంగా, ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలలలో, 2025-26 విద్యా సంవత్సరానికి, 1వ తరగతిలో ఉచిత ప్రవేశాలకు సంబంధించి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ల కోసం విస్తత ప్రచారం కల్పించాలని, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా ద్వారా విద్యార్థుల తల్లి తండ్రులకు తెలియ పరచవలసినదిగా మండల విద్యాశాఖ అధికారులను కోరినట్టు తెలిపారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానంపై ప్రతి మండలంలో విస్తత ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉందని వాసుదేవరావు తెలిపారు. అన్ని సచివాలయాలు, విద్యాశాఖాధికారుల కార్యాలయాలలో, రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేక హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసి ఫోటోలు షేర్ చేయాలని తెలిపారు. హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసి, నేటి నుండి వీలైనంత ఎక్కువ మందితో, రిజిస్ట్రేషన్‌లు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ధాన్యం కొనుగోలుకు మంత్రి దుర్గేష్ ఆదేశం

ప్రజాశక్తి-పెరవలి

రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని మంత్రి కందుల దుర్గేష్ అధికారులను ఆదేశించారు. వియత్నాం పర్యటనలో ఉన్న మంత్రి దుర్గేష్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. నియోజవర్గంలో ఇప్పటివరకు 8,650 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు మంత్రి తెలిపారు. నిడదవోలు మండలంలో 5,020 టన్నులు, పెరవలి మండలంలో 2,950 టన్నులు, ఉండ్రాజవరం మండలంలో 680 టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు తెలిపారు. నియోజకవర్గంలోని 56 గ్రామాల్లో ధాన్యం కొనుగోలుకు తగు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో మరిన్ని టన్నుల ధాన్యం కొనుగోలు చేయనున్నట్టు ఆయన తెలిపారు. అడిగిన వెంటనే స్పందించి మంత్రి దుర్గేష్ చర్యలు చేపట్టడంపై రైతాంగం హర్షం వ్యక్తం చేసింది.

ఆర్థిక సాయం అందిస్తున్న ఎంఎల్ఎ వాసు

పేద విద్యార్థినికి ఎంఎల్‌ఎ వాసు సాయం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ తమ భవాని చారిటబుల్ ట్రస్ట్ తరపున ఒక పేద విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేశారు. కాకినాడ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో 3వ సంవత్సరం చదువుతున్న హరికేశ్వరి అనే పేద విద్యార్థిని చదువు నిమిత్తం రూ.26,000ను భవాని చారిటబుల్ ట్రస్ట్ తరపున ఆర్థిక సాయం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ భవాని ఛారిటబుల్ ట్రస్ట్ తరపున ఇటువంటి సేవా కార్యక్రమాలు నిత్యం చేస్తున్నట్టు తెలిపారు. ఏటా అనేక మంది పేద విద్యార్థులకు వారి ఫీజు నిమిత్తం తమ ట్రస్ట్ తరపున ఆర్థిక సహకారం అందిస్తున్నట్టు తెలిపారు. కొంత మంది పేద విద్యార్థులను దత్తత తీసుకుని వారి చదువు విషయంలో వారి పూర్తి బాధ్యతలు తామే తీసుకున్నట్టు తెలిపారు. పేదల కోసం తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తమ ట్రస్ట్ తరపున ఇలాంటి సేవా కార్యక్రమాలు నిత్యం చేస్తూనే ఉంటామని ఎంఎల్ఎ తెలిపారు.

కార్టూ'నిజం'

ధాన్యం మొత్తం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి చాగల్లు

టార్గెట్ పెంచి రబీ ధాన్యం మొత్తం ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా కన్వీనర్ గారపాటి వెంకట సుబ్బారావు డిమాండ్ చేశారు. రబీలో పండించే కొనుగోలు లక్ష్యం పూర్తయిందని, రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో కొనుగోలు నిలిపివేశారని, దీనివల్ల రైతులు, కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టార్గెట్ పెంచి మిల్లర్స్ బ్యాంక్ గ్యారంటీ ఇప్పించి రైతుల దగ్గర ధాన్యం కొనుగోలు చేయాలని రైతు సేవా కేంద్రం దగ్గర రైతులు, కౌలు రైతులు అకాల వర్షాలకు గాలి వానలకు పండించిన ధాన్యాన్ని వర్షాల బారి నుంచి కాపాడుకోవడానికి కష్టమవుతోందన్నారు. వాతావరణం ఏ సమయంలో ఎలా ఉంటుందో చెప్పలేకపోతున్నామని, ఈ పరిస్థితుల్లో పండించిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రం వారు వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి టార్గెట్ పెంచాలని ఆయన కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ కమిటీ సభ్యులు

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి -దేవరపల్లి

శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి తృతీయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలను సోమవారం నుంచి నాలుగు రోజులపాటు ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ ఛైర్మన్ అంబటి శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్వామివారికి పూజా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం 10వ తేదీన అన్నదానం నిర్వహిస్తామన్నారు. ఈ తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో అందరూ పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో గుడ్ల వెంకటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, వెలగా శ్రీనివాసరావు, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు ఆదేశం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ధాన్యం కొనుగోళ్ల విషయంలో అధైర్య పడవద్దని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విదేశీ పర్యటనలో ఉన్న మంత్రి నియోజకవర్గంలోని ఉండ్రాజవరం మండల రైతుల కోరిక మేరకు మరో 680 టన్నుల ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వడ్లూరులో 300 టన్నులు, పసలపూడిలో 200 టన్నులు, సత్యవాడ, సూర్యారావుపాలెం, తాడిపర్రు, వేలివెన్ను, కాల్దారి గ్రామాలలో 180 టన్నుల ధాన్యం కొనుగోలుకు ఆదేశించినట్టు పేర్కొన్నారు. రైతు సేవా కేంద్రానికి తాళాలు అంటూ ప్రజాశక్తిలో ఆదివారం వార్త ప్రచురితమైన సంగతి పాఠకులకు తెలిసిందే.

పరీక్షల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

నీట్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలోని ఎనిమిది పరీక్షా కేంద్రాల్లో 2,760 మంది విద్యార్థులు నీట్ పరీక్షలు కోసం దరఖాస్తు చేసుకున్నారని, అందులో 2,690 విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. ఆదివారం రాజమహేంద్రవరం పరిధిలో ఒఎన్‌జిసి బేస్ కాంప్లెక్స్, ఆర్ట్స్ కళాశాల పరీక్షా కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అక్కడ విధుల్లో ఉన్న అధికారులు, ఇన్విజిలేటర్స్ ఇతర సమన్వయ అధికారులకు పలు సూచనలను చేశారు. జిల్లాలోని 8 పరీక్షా కేంద్రాల్లో నీట్ ఎగ్జామ్స్ ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయని కలెక్టర్ తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు పర్యవేక్షణలో స్థానిక కంబాల చెరువు ఎస్‌బిఐ బ్రాంచి నుంచి ప్రశ్న, జవాబు పత్రాలను అత్యంత భద్రత మధ్య ఆయా పరీక్షా కేంద్రాలకు తరలించారు.

పచ్చదనానికి నర్సరీ రైతుల కృషి

ప్రజాశక్తి-కడియం



మంత్రి నిమ్మలను సత్కరిస్తున్న పుల్లా వీరవెంకట్రావు

పాలకొల్లు పట్టణంలో ఆదివారం జరిగిన లయన్స్ ఇంటర్నేషనల్ మల్టిపుల్ డిస్ట్రిక్ 316 కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయనకు సత్యదేవా నర్సరీ అధినేత, ఆల్ ఇండియా నర్సరీ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి పుల్లా వీర వెంకట్రావు పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ మన రాష్ట్రంలోని కడియపులంక నర్సరీలు దేశ విదేశాలలో అత్యంత ప్రాముఖ్యత సంతరించుకున్నాయని పేర్కొన్నారు. ప్రపంచ పచ్చదనానికి, సుందరీకరణకు నిరంతరం కృషి చేస్తున్న శ్రీసత్యదేవా నర్సరీ యాజమాన్యాన్ని, నర్సరీ రైతుల కృషిని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో నర్సరీ రైతులు పుల్లా ఆంజనేయులు, పుల్లా పెద్ద సత్యనారాయణ, పుల్లా చిన సత్యనారాయణ, పుల్లా వీర్రాజు, పుల్లా రాజశేఖర్, నక్కా అమ్మిరాజు, కర్రి యేసయ్య, పుల్లా శ్రీకాంత్, పెమ్మనబోయిన పెద్ద కాపు, కొండేపూడి నాగు, వజ్రపు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సిసి కెమెరాల అందజేత

ప్రజాశక్తి-కడియం

సిఐకు కెమెరాలు అందజేస్తున్న ఆలయ కమిటీ

మండలంలోని పలు ప్రాంతాలలో నిఘా నిమిత్తం ఏర్పాటు చేయడానికి కావాల్సిన సిసి కెమెరాలను కడియపులంక ఆంజనేయస్వామి కమిటీ సభ్యులు అందజేశారని కడియం సిఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని వివిధ ప్రాంతాలలో ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేయడానికి, ఆంజనేయస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ పల్ల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, గ్రామస్తుల సహకారంతో రూ.లక్ష విలువచేసే కెమెరాలను కడియం సిఐకు అందించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఈ కెమెరాలు నేరస్తులను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయ కమిటీ సభ్యులకు, గ్రామస్తులకు సిఐ ధన్యవాదాలు తెలిపారు.

కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

అధిక వర్షాలు, ఈదురు గాలుల నేపథ్యంలో జిల్లాలలో ఏవైనా ప్రతికూల పరిస్థితులు తలెత్తితే రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ed-apsdma@ap.gov.in లేదా seoc-apsdma@ap.gov.in మరియు టోల్ ఫ్రీ నంబర్లు 1070, 1800-425-0101, 8333905022కు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా కలెక్టరేట్‌లో 24/ 7 కంట్రోల్ రూమ్ నంబర్ 8977935611, అదే విధంగా డివిజన్ స్థాయిలో రాజమహేంద్రవరం ఆర్‌డిఒ కార్యాలయంలో 08832442344, కొవ్వూరు ఆర్‌డిఒ కార్యాలయంలో 8500667698 ఫోన్ నెంబర్లలో కూడా సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ రూమ్ 24/7 అందుబాటులో ఉండే సిబ్బంది వివరాలు, ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో సమాచారం ఆయా నంబర్లకు ఫోన్ చేసి చెప్పాలని కోరారు.

పేద విద్యార్థులకు స్పృహ సొసైటీ సాయం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

నిరుపేద, అట్టడుగు వర్గాలు, అనాథలు, సింగిల్ పేరెంట్ పిల్లలకు 100 శాతం స్కాలర్‌షిప్‌తో మెరుగైన ఉచిత విద్య అందించేందుకు స్పృహ ఎడ్యుకేషన్ ఎంపవర్మెంట్ ట్రస్ట్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు నిర్వాహకులు మధుసూదన్ రావు, కుర్మారావు, రూపస్‌రావు తెలిపారు. 2024- 25 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఈ దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ఏడో తేదీ దరఖాస్తు చేసుకోవడానికి చివరి గడువు అని పేర్కొన్నారు. రాజమండ్రి కేంద్రంగా రాతపరీక్ష నిర్వహించి తద్వారా ఎంపికైన విద్యార్థులకు ఉచితంగా ఇంటర్మీడియట్‌లో కార్పొరేట్ కళాశాలలో విద్యను అందిస్తామని వారు పేర్కొన్నారు. ఆ తర్వాత కూడా వారు ఐఐటియన్లు, డాక్టర్లు కావడానికి కూడా తగిన శిక్షణ ఇప్పించి చదివిస్తామన్నారు. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, డాక్టర్ బి.ఆర్అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, విశాఖపట్నం జిల్లాల విద్యార్థులు మాత్రమే ఈ దరఖాస్తుకి అర్హులన్నారు. మరిన్ని వివరాలకు రూపస్ రావు 9390059900 ఫోన్ నెంబర్‌లో సంప్రదించవచ్చు అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జగ్గంపేట ఎంఇఒ స్వామి, యుటిఎఫ్ నాయకులు కె.రమేష్, విజయ్ బాబు, సిహెచ్.దయానిధి, అనిల్ కుమార్, భీమయ్య కోరారు.

నేడు కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్ నిర్వహణ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జిల్లా, డివిజన్, మండలాల్లో నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ యథావిధిగా సోమవారం మే 5న నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం '1100 మీకోసం కాల్ సెంటర్' ద్వారా ఫిర్యాదు నమోదు, నమోదైన ఫిర్యాదు యొక్క స్థితిగతులు తెలుసుకోవచ్చునని తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో అదేవిధంగా డివిజన్, మున్సిపల్, మండల కేంద్రంలో ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకూ ప్రజల నుంచి పిజిఆర్ఎస్ అర్జీలను స్వీకరిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రత్యేక అధికారులు, జిల్లా, డివిజన్ మండల, మున్సిపల్ క్షేత్ర స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని స్పష్టం చేశారు. ప్రజలు వ్యయ ప్రయసలుపడి ప్రభుత్వ కార్యాలయాలకు వొచ్చి ఫిర్యాదు చెయ్యకుండా '1100' టోల్ ఫ్రీ నెంబర్‌కు నేరుగా తమ సమస్యలను తెలియజేయడం ద్వారా కూడా పరిష్కారం అయ్యే దిశగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

అలరించిన కవులు, గాయకుల సమ్మేళనం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

అంబేద్కరీయం పేరిట కవులు గాయకుల సమ్మేళనం ఏర్పాటు చేయడం ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన అంబేద్కర్ సేవా కేంద్రం చరిత్రలో నిలుస్తుందని రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్ పాడి రామారావు ప్రశంసించారు. ఆదివారం ఉదయం స్థానిక మోడల్ కాలనీలోని ఎల్ఐసి ఉద్యోగుల సంఘ భవనంలో జరిగిన కవులు గాయకుల సమ్మేళనంలో రామారావు గాయకుడిగా పాల్గొని తన పాటలతో అలరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ సేవా కేంద్రం చేస్తున్న సేవలు నిర్వహిస్తున్న కార్యక్రమాలు నూతన ఒరవడిని సష్టిస్తున్నాయని నిర్వాహకులు రాంబాబు సేవలను ప్రశంసించారు. సమావేశానికి ప్రముఖ కవి డాక్టర్ గూటం స్వామి నిర్వాహకులుగా వ్యవహరించారు. ఉభయగోదావరి జిల్లాల నుండి సుమారు 100 మంది కవులు గాయకులు పాల్గొని తమ కవితలతోనూ గానంతోనూ అలరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఇపిడిసిఎల్ ఎస్‌వి కె.తిలక్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని కవులు గాయకులను సన్మానించి అభినందించారు. సమ్మేళనానికి అంబేద్కర్ సేవా కేంద్రం ఛైర్మన్ డాక్టర్ గుబ్బల రాంబాబు అధ్యక్షత వహించారు గోదావరి జిల్లాలతో పాటు శ్రీకాకుళం నెల్లూరు జిల్లాల నుండి పలువురు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వంట మాస్టర్ వలీబాషా హత్య

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు పట్టణానికి చెందిన వంట మాస్టర్ వలీ బాషా (50) ఆదివారం ఉదయం హత్యకు గురయ్యారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వైఎస్ఆర్ కాలనీకి చెందిన యువకుడు సిరంగల అనిల్ స్థానిక చింత చెట్టు వీధికి చెందిన షేక్ వలీబాషా కుమార్తెను వేధించడంతో 2021లో అనిల్‌పై పోక్సో కేసు నమోదయ్యింది. ప్రస్తుతం ఆ కేసు ముగింపు దశలో ఉంది. ఈ కేసు విషయయంలో బాషా రాజీకి అంగీకరించకపోవడంతో అనిల్ కక్షగట్టాడు. ఈ కేసులో అనిల్ బెయిల్‌పై బయటికి వచ్చాడు. ఆదివారం ఉదయం ఐదు గంటలకు నమాజ్ ముగించుకుని రాజమహేంద్రవరం వెళ్లేందుకు సిద్ధమవుతున్న బాషాపై అప్పటికే కాపు కాసిన అనిల్ కత్తితో దాడి చేశాడు. దీంతో తీవ్రంగా గాయపడిన బాషా అక్కడికక్కడే మృతి చెందాడు. నిడదవోలు పోలీసులు అనిల్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఆటోను ఢీకొన్న వ్యాను పలువురికి గాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పోలేకుర్రు పంచాయితీ జై భీమ్‌పేట వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు అయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...యానం నుంచి కాకినాడ వైపు వెళ్తున్న ఆటోను రొయ్యల లోడుతో కాకినాడ వైపు వెళ్తున్న వ్యాను వెనకవైపు నుంచి బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తో పాటు ఐదుగురికి గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రులను స్థానిక యువకులు 108లో తాళ్ళరేవు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కోరంగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాడుతున్న ఏడుగురు అరెస్టు

ప్రజాశక్తి - సీతానగరం

మిర్తిపాడులో పేకాడుతున్న ఏడుగురిని సీతానగరం పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.7,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సీతానగరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదానం చేస్తున్న నిర్వహకులు

మరిడమ్మ ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ ఆలయంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఎసి కె.విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఆదివారం దాతల సహకారంతో ఆలయానికి వచ్చే యాత్రికులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఆశాధులు రాయి నాని, రామచంద్రప్రసాద్, వేద పండితులు ఎన్‌వి.అవధాని, శంకర్, ఆలయ పూజారి ఐవి.ప్రసాద్‌శర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మృతుని కుటుంబానికి ఉపాధ్యాయులు ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని ర్యాలి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆత్రేయపురానికి చెందిన వేగేశ్న సత్యనారాయణ రాజు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. మృతుని కుటుంబ సభ్యులను 1992-93 బ్యాచుక్ చెందిన టిటిసి ఉపాధ్యాయులు ప్రకాశం జిల్లా మైనంపాడు చెందిన ఎఎస్‌డి.ప్రసాద్‌రావు, పి.సత్తిబాబు, ఎస్ఎస్ఎస్.ప్రసాద్, ఐఎస్ వివి.ప్రసాద్‌లు సత్యనారాయణ పరామర్శించారు. మృతుని కుటుంబానికి రూ.1 లక్షా 5 వేల ఆర్థిక సాయాన్ని వారు అందజేశారు.

'కమీషన్ల కోసం అధికార పార్టీ నాయకుల కక్కుర్తి'

ప్రజాశక్తి - అమలాపురం

కమిషన్ల కక్కుర్తితో ప్రజా ధనాన్ని రాజధాని పేరుతో అధికార పార్టీ నాయకులు అమరావతికి మళ్లిస్తున్నారని వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి కూటమి ప్రభుత్వాన్ని ఆరోపించారు. ఆదివారం అమలాపురం స్థానిక ప్రెస్‌క్లబ్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రశ్నించేందుకే నేను ఉన్నాను అని చెప్పిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నించరేంటరని అన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పున:ప్రారంభించాలని జగ్గిరెడ్డి కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోళ్లలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై త్వరలోనే వైసిపి ఆధ్వర్యంలో జిల్లాలో ఉద్యమం చేపడతామని చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సిలు కుడుపూడి సూర్య నారాయణ, బొమ్మి ఇజ్రాయెల్, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, అమలాపురం ఇన్‌ఛార్జి పినిపే శ్రీకాంత్, పి.గన్నవరం ఇన్‌ఛార్జి గన్నవరపు శ్రీను, చెల్లుబోయిన శ్రీను, ఒంటెద్దు వెంకన్న నాయుడు, మాజీ ఎంఎల్ఎ పాముల రాజేశ్వరి దేవి, కుడుపూడి త్రినాతరావు, చోల్లంగి సుబ్బిరామ్, గుత్తుల చిరంజీవి,కేతా భాను తేజ,దొంగ బాలాజీ పార్టీ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సజావుగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ

ప్రజాశక్తితో జెసి రాహుల్ మీనా

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

రబీ 2024-25 రైతులు పండిచిన ధాన్యాన్ని దళారులు, మధ్యవర్తుకులకు అమ్ముకొని మోసపోకుండా నాణ్యత ప్రమాణాలకు లోబడి వున్నా అన్ని రకముల ధాన్యమునకు కనీస మద్దతు ధర పొందాలని, ఈ నేపథ్యంలోనే ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లాలో సజావుగా చేపట్టినట్లు జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అన్నారు.జిల్లాలో ఈ ఏడాది రబీ సీజన్లో 1.62 లక్షల ఎకరాల్లో 1.45 లక్షల మంది రైతులు వరిని పండించారు.5.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. 225 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సేకరిస్తున్నట్లు ఆయన తెలిపారు ఇంకా పలు విషయాలను ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు.

కొనుగోలు ఎలా జరుగుతోంది.?

జిల్లాలో ఇప్పటి వరకు సుమారు రూ.125 కోట్లు విలువైన 62 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 7 వేల మంది రైతుల నుంచి కొనుగోలు చేయడం జరిగింది. ఇప్పటికే సుమరు రూ.120 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసాము. ధాన్యం సేకరణకు అవసరమయ్యే గోను సంచులను, హమలిలను, రవాణా వాహనములను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. ధాన్యం కొనుగోలు, తేమ పరిశీలన, ఆన్లైన్ విధానం పై సిబ్బందికి పూర్తి అవగాహన ఉంది. రైతులు ధాన్యం అమ్మేటప్పుడు తేమ సమస్య వచ్చినట్లయితే ధాన్యం కొనుగోలు కేంద్రాలలో సంప్రదించినట్లయితే అట్టి సమస్యను సిబ్బంది పరిష్కరిస్తున్నారు.

సొమ్ము సకాలంలో జమ అవుతోందా.?

ధాన్యం ఇష్టాపూర్వకంగా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయడం, సదరు చెల్లింపులు 24 గంటలు మించకుండా నేరుగా రైతుల ఖాతాలకు ప్రభుత్వం ఆన్లైన్ పద్ధతి ద్వార జమ చేయడం జరుగుతుంది. ధాన్యం అమ్మకంలో ఎటువంటి అపోహలు లేకుండా సందేహాలు, ఇబ్బందులపై జిల్లా కమాండ్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8886903611 నకు సంప్రదించవచ్చు.

తేమ శాతం ఎంత వరకూ పెంచారు.?

తేమ శాతం 17 శాతంకు బదులుగా 22 శాతం వరకు తేమ ఉన్నా ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు తగిన చర్యలు చేపట్టడం జరిగింది. రైతు సేవా కేంద్రంలోని టెక్నికల్

అసిస్టెంట్ రైతుల కళ్ళల వద్దకు వెళ్ళి ధాన్యాన్ని పరిశీలించి డేటా ఎంట్రీ ఆపరేటర్ ద్వారా ఆన్ లైన్ లో నమోదు చేసి వెహికల్ మూమెంట్ జీపిఎఫ్ ట్రాక్ చేసి మిల్లుకు పంపించడం జరుగుతుంది. సేకరించిన ధాన్యాన్ని రైతు కోరిన రైస్ మిల్లుకు రవాణా చేయబడుతుంది. సేకరణకు అవసరమైన గోనె సంచులు రవాణా వాహనాలను రైతులు స్వయంగా సమకూర్చుంటే ఆ సొమ్మును కూడా ప్రభుత్వం నేరుగా రైతు ఖాతాలలో జమ చేస్తుంది.

నాణ్యతా ప్రమాణాలు ఏ విధంగా ఉన్నాయి.?

కనీస మద్దతు ధర పొందడానికి ధాన్యం మట్టి, రాళ్ళు, ఇసుక మొదలగు వ్యర్థ పదార్థాలు1 శాతం, గడ్డి, చెత్త, తప్ప, కలుపు విత్తనాలు 1 శాతం, చెడిపోయిన, రంగుమారిన, మొలకెత్తిన, పురుగుతిన్న ధాన్యపు గింజలు 5 శాతం, పరిపక్వముకాని, ముడుచుకుపోయిన, వంకర తిరిగిన ధాన్యపు గింజలు 3శాతం, తక్కువ శ్రేణి ధాన్యపు గింజలు లేక కేళీలు 6 శాతం, తేమ లేక నిమ్ము 17 శాతం, చెడిపోయిన, మొలకెత్తిన, పురుగుతిన్న ధాన్యపు గింజలు 4 శాతం మించకూడదు.

అధికారుల కనుసన్నల్లోనే..!

-జోరుగా మద్యం అక్రమ అమ్మకాలు
-వందల్లో బెల్ట్ షాపులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ప్రభుత్వాలు మద్యాన్ని ఒక ఆదాయ వనరుగా మార్చుకుంటున్న తరుణంలో ఎక్సైజ్ శాఖ అధికారుల కనుసన్నల్లోనే మద్యం వ్యాపారం విచ్చలవిడిగా సాగుతోంది. గత వైసిపి పాలనలో మద్యపానాన్ని నియంత్రస్తామని చెప్పుకొచ్చి ప్రభుత్వమే మద్యం అమ్మకాలను సాగించింది. నకిలీ బ్రాండ్లను సైతం మార్కెట్లోకి తీసుకొచ్చి ప్రభుత్వమే నేరుగా విక్రయించడం విమర్శలకు గురయింది. కూటమి పెద్దలు ఎన్నికలకు ముందు జగన్‌ను తీవ్రస్థాయిలో విమర్శించారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వమే ప్రయివేటు వ్యాపారస్తులకు మద్యం దుకాణాలను అప్పగించి ఇష్టారీతిన అమ్మకాలను సాగిస్తుంది. ఈ నేపథ్యంలోనే జోరుగా బెల్టు షాపులు నడుస్తున్నాయి. లైసెన్స్ మద్యం దుకాణాలకు అనుబంధంగా వందల కొలదీ బెల్ట్ షాపుల్లో 24 గంటలూ మద్యం అందుబాటులో ఉంటోంది. ఈ నేపథ్యంలోనే కూటమి ప్రభుత్వ విధానం కొత్త సీసాలో పాత సారా అన్నట్టుగా ఉందని ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పట్టని అధికారులు

కాకినాడ జిల్లాలో 155 ప్రయివేటు మద్యం దుకాణాలు, 20 బార్లు, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 169 షాపులు, 10 బార్లు, తూర్పుగోదావరి జిల్లాలో 154 దుకాణాలు, 19 బార్లు ఉన్నాయి. అలాగే మండలానికి ఒకటి చొప్పన నెల రోజుల క్రితం బీసీ కులాలకు ప్రత్యేకంగా కేటాయించిన షాపులు కూడా అందుబాటులోకి వచ్చాయి.

రెండేళ్ల పాటు లైసెన్సు గడువు ఉన్నందున ఇప్పటికే ఆరు నెలలు గడిచిపోయింది. దీపం ఉండగా ఇల్లు చక్కబెట్టు కోవాలనే రీతిలో అటు మద్యం వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరుపుతున్నారు. ఇటు అధికారులు సైతం వారికి వత్తాసు పలుకుతూ మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సమయ పాలన లేకుండా అమ్మకాలు జరుగుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడని పరిస్థితి ఏర్పడింది. అలాగే సిట్టింగ్ లకు పర్మిషన్లు లేకపోయినప్పటికీ ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. మరోవైపు లైసెన్సు షాపులకు అనుబంధంగా వందల సంఖ్యలో బెల్ట్ షాపులు నడుస్తున్నాయి. ఒక్కో మద్యం దుకాణానికి పదుల సంఖ్యలో బెల్ట్ షాపుల్లో విక్రయాలు జరుపుతున్నారు. క్వార్టర్ బాటిల్‌పై రూ. 20 నుంచి 30 వరకూ అదనంగా వసూలు చేస్తున్నారు. వీటిపై చర్యలు చేపట్టాల్సిన అధికారులు చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

తూతూ మంత్రపు చర్యలేనా...?

బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలను అరికట్టే చర్యలలో భాగంగా ఎప్పటికప్పుడు బెల్ట్ షాపుల్లో అక్రమ విక్రయాలను అరికడుతున్నామని ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రకటనలు ఇస్తున్నారు తప్ప ఆచరణలో పూర్తి స్థాయి చర్యలు తీసుకోలేకపోతున్నారు. రాజకీయ నాయ కులు, మద్యం దుకాణాల యజమానుల ఒత్తిళ్ళ నడుమ ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడిందని కొందరు అధికారులు వాపోతుండడం గమనార్హం. అయితే పలుచోట్ల వ్యాపారుల నుంచి భారీగా ముడుపులు ముడుతున్నాయన్న కారణం తోనే అరకొర చర్యలకు పరిమితమవుతున్నారనే ఆరోపణలు అధికారులపై గట్టిగా వినిపిస్తున్నాయి. ఒక్కో గ్రామంలో 2 నుంచి 10 వరకు బెల్టు షాపులు నడుస్తున్నాయి. పట్టణాల్లో అయితే 100 వరకూ ఉంటాయి. మండలంలో అన్ని గ్రామాల్లో 200 నుంచి 300 వరకు బెల్ట్ దుకాణాలు ఉండగా కొండను తవ్వి ఎలుకను పట్టుకున్న చందంగా తూతు మంత్రపు చర్యలకే పరిమితం అవుతున్నారు. ఈనెల 1న గురువారం కాకినాడ జిల్లా వ్యాప్తంగా దాడులు జరిపామని అసిస్టెంట్ ఎక్సైస్ సూపరింటెండెంట్ జయ మౌనిక తెలిపారు. అక్రమ విక్రయాలు జరపుతున్న వ్యక్తులను, మద్యాన్ని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసామన్నారు. అయితే రికార్డుల్లో కేసులను చూపించు కోవడం కోసం ఒక్కో మండలం ఒక్కో కేసును నమోదు చేసి చేతులు దులుపుకున్నారన్న విమర్శలు ప్రజల నుంచి వచ్చాయి. పెదపూడి, పెద్దాపురం, తుని, పిఠాపురం పట్టణం, ప్రత్తిపాడు, కరప, కాకినాడ అర్బన్ ప్రాంతాల్లో మాత్రమే బెల్ట్‌లపై తమ ప్రతాపాన్ని చూపించగలిగారు. దాడులు నిరంతరం కొనసాగుతాయని, బెల్ట్ షాపుల ద్వారా అక్రమంగా మద్యం విక్రయించే వారిపై కఠిన చర్యలు చేపడతామని ఈ సందర్భంగా హెచ్చరించారు. వందల సంఖ్యలో బెల్ట్ షాపులు ఉండగా, నిర్దిష్టంగా బెల్ట్ షాపులు వివరాలు అధికారులకు తెలిసినప్పటికీ అరకొర చర్యలు మాత్రమే తీసుకోవడంతో ఎక్సైజ్ శాఖపై అనేక అవినీతి ఆరోపణలు ఈ సందర్భంగా గట్టిగానే వినిపిస్తున్నాయి.

మెరిట్ విద్యార్థులకు సత్కారం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

ఇటీవల జరిగిన వివిధ పరీక్షల లో ప్రతిభ కనబర్చిన బండారు లంక గ్రామ దేవాంగ విద్యార్థిని, విద్యార్థుల ను ఆదివారం ఆ గ్రామంలో వివిఎస్ఎమ్‌కాన్ఫరెన్సు హాల్లో వూటుకూరి వీరబ్రహ్మం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ట్రస్ట్ ఛైర్మన్ వూటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి అధ్యక్షత న జరిగిన సభలో గేట్-2025లో 10వ ర్యాంకు సాధించిన పిచ్చిక కుమార వాసు, ఇంటర్మీడియేట్ -2025 పరీక్షలలో 1000 గాను 990 మార్కులు సాధించిన లక్కింశెట్టి చాందిని, ఈ ఏడాది 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 596 మార్కులు సాధించిన పిచ్చిక జాహ్నవి నాగ సాయి గనేశ్వరి,ఇదే పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన ములికి దీక్షిత, చింతా మేఘనా ఐశ్వర్య, దొంతంశెట్టి మౌనికలను శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందజేశారు. వారికి జ్ఞాపికలు, అభినందన పత్రాలు అందించి తల్లిదండ్రుల, పెద్దల సమక్షంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వూటుకూరి సోమరాజు, బాబీ గీతిక దంపతులు, గుమ్మిడి రాజు, చింతా లింగమూర్తి, మావూరి సత్యనారాయణ, యర్రా గోపాలరావు, కార్టూనిస్ట్ మాడా రాము, మావూరి సాంబశివరావు, ఇనుమర్తి లింగమూర్తి, కారుపర్తి మల్లేశ్వర రావు, చింతా యోగానంద్,చింతా అత్తిలింగం, చింతా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బండారులంకలో ప్రతిభ కలిగిన విద్యార్థులను సత్కరిస్తున్న వూటుకూరి వీరబ్రహ్మం చారిటబుల్ ట్రస్ట్

బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సత్యనారాయణకు సన్మానం

ప్రజాశక్తి - అమలాపురం, అల్లవరం

జిల్లా అమలాపురం న్యాయవాదుల బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షునిగా యాలంగి సత్యనారాయణని ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా దేవగుప్తం సర్పంచ్ సాధనాల వెంకట్రావు స్వగృహం నందు ఆదివారం సర్పంచ్ వెంకట్రావు దంపతులు యాలంగి సత్యనారాయణను దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం వెంకట్రావు మాట్లాడుతు న్యాయవాదిగా యాలంగి సత్యనారాయణ పేదలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకు న్నారని అన్నారు. చిన్ననాటి నుంచి తాను పడిన కష్టం నేటికీ మర్చి పోకుండా పేద వర్గాల పక్షాన ఆప్యాయతగా మెలిగారన్నారు. అంబేద్కర్ ఆశయాలు వైపు అడుగులు వేస్తూ సమాజ హితం కోసం సామాజిక స్పృహతో మెలుగుతూ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం లీగల్ అడ్వై జర్‌గా న్యాయ సహాయం అందిస్తున్నారని అన్నారు. సత్యనారాయణ న్యాయవాదుల బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఏకగ్రీవంగా నియ మితులైనందుకు, బార్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులందరికి అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు కాశీ బాలయోగి, యువ నాయకులు సాధనాల శ్రీనువాసరావు , రాజు,ఎస్. శ్రీను సీనియర అడ్వకేట్ బడుగు సత్యనారాయణ , కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసిదుర్గరావు మండల కన్వీనర్ గెడ్డం విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది సత్యనారాయణను సన్మానిస్తున్న సర్పంచ్ వెంకట్రావు తదితరులు

ముగిసిన కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

స్థానిక ఎన్‌టిఆర్ బీచ్‌లో జరుగుతున్న కబడ్డీ పోటీలు ఆదివారం ముగిశాయి. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎంపి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎంఎల్ఎలు పంతం నానాజీ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎంఎల్‌సిలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, కుడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి, వనమాడి వెంకటేశ్వరరావు, అయితాబత్తుల ఆనందరావు, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ తోట సుధీర్, తదితరులు క్రీడాకారులతో ముచ్చటించారు. చిత్తూరు-కృష్ణా జిల్లాల మహిళల జట్ల ఫైనల్ మ్యాచ్లో కృష్ణా జట్టు విజేతగా నిలిచింది. పురుషుల జట్టులో నెల్లూరు జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు అతిథులు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

యానాం వార్తలు

ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంఎల్ఎ అశోక్ దంపతులు

సొంతింటి నిర్మాణానికి ఎంఎల్ఎ భూమిపూజ

ప్రజాశక్తి - యానాం

యానాం బెజవాడ గార్డెన్స్‌లో ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, స్నేహ దంపతులు సొంతంటి నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. కుటుంబ సభ్యులు, గొల్లపల్లి అభిమానులు, స్థానిక ప్రముఖులు, నాయకుల సమక్షంలో వారు భూమి పూజ చేశారు.

ఎంపి వైద్యలింగంను సత్కరిస్తున్న దినేష్

కాంగ్రెస్ ఎంపీని కలిసిన దినేష్

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ఎంపి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైదిలింగం, అలాగే సిఎల్‌పి నాయకుడు వైద్యనాథన్‌లను యానాం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అర్థాని దినేష్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం రాత్రి పుదుచ్చేరిలో కూటమి ప్రభుత్వ పాలనను ఖండిస్తూ జరిగిన కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభకు దినేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపితో యానాం నియోజకవర్గానికి సంబంధించిన పలు విషయాలను చర్చించారు. ముందుగా ఎంపిని దుస్సాలువాతో సత్కరించారు.

భారీ వర్షంతో విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి - యానాం

ఆదివారం ఉదయం కురిసిన భారీ వర్షానికి పలుచోట్ల విద్యుత్ వైర్లు తెగిపోవడంతో నియోజకవర్గంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఉదయం నుంచి సాయంకాలం వరకు విద్యుత్ రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అనంతరం ప్రాంతాలవారీగా విద్యుత్ సరఫరాను విద్యుత్ శాఖ అధికారులు అందించారు. వాతావరణం చల్లబడటంతో కరెంటు లేకపోయినా కొంతమేర ఉపశమనం లభించిందని ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అలాగే పలుచోట్ల అక్కడక్కడ ధాన్యం రాశులు తడిసిపోయాయి.

వైసిపి యూత్ ప్రెసిడెంట్‌గా సతీష్‌కుమార్

ప్రజాశక్తి - పెద్దాపురం

దొరబాబును కలిసిన సతీష్ కుమార్

పట్టణ వైసిపి యూత్ ప్రెసిడెంట్‌గా కురందాసు సతీష్ కుమార్‌ను వైసిపి అధిష్టానం నియ మించింది. ఈ సందర్భంగా సతీష్ కుమార్ వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్‌లను ఆదివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కొట్టు కిషోర్‌పవన్, విడదాసరి రాజా, కౌన్సిల్ కోఆప్షన్ సభ్యుడు వాసంశెట్టి గంగ, వైసిపి నాయకులు బొడ్డు ప్రకాష్ పాల్గొన్నారు.

ఘనంగా దాసరి నారాయణరావు జయంతి

ప్రజాశక్తి - మండపేట

మండపేట మండలం ఏడిదలో ఆదివారం డిఎన్ఆర్ భవన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సినీ దర్శకుడు డాక్టర్ దాసరి నారాయణరావు 78 వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ట్రస్టు మేనేజింగ్ కామన ప్రభాకరరావు, తదితరులు, ముఖ్యఅతిథిగా పాల్గొని దాసరి నారాయణరావు చిత్ర పటానికిపూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కామన మాట్లాడుతూ డాక్టర్ దాసరి నారాయణరావు ఒక మధ్య తరగతి కుటుంబం లో జన్మించి ప్రపంచము లోనే ఒక గొప్ప వ్యక్తి గా ఎదిగారన్నారు. ముఖ్యం గా చిత్ర పరిశ్రమ లో దాదాపు 160 సినిమాలకు దర్శకత్వం వహించి గిన్నిస్ బుక్ లోకి ఎక్కిన ఏకైక దర్శకుడు అని పేర్కొన్నారు. రాజకీయ రంగం లో కూడా తనదైన ముద్ర వేసి కాంగ్రెస్ పార్టీ నుంచి కేంద్ర మంత్రి పదవినీ చేపట్టి అనేక మంది నాయకులను తయారు చేయడం చిత్ర పరిశ్రమ లో అనేక మందిని తయారు చేసిన గొప్ప దర్శకుడని కొనియాడారు. ఏడిద గ్రామం లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం పార్లమెంటు నియోజక వర్గ నిధులను ఇచ్చి సహకారం అందించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. అన్ని రకాల అర్హతలు ఉన్న వ్యక్తి గా ఆయన కు భారత రత్న అవార్డు ను ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.అనంతరం స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాడిశెట్టి సత్యనారాయణ, వాసిరెడ్డి బాబురావు,, చింతలపూడి బాబీ, ముగ్గుల్ల శ్రీను, వల్లభదాసు చిన్న, గంగ్రోతుల సురేష్, కుచ్చు బాబీ, నరేడ్ల సాయి, ఎర్రంశెట్టి పవన్, గంగ్రోతుల ప్రభాకర్ తదితరులు, పాల్గొన్నారు.

దాసరి నారాయణరావు చిత్రంపటం వద్ద నివాళులర్పిస్తున్న కామన ప్రభాకరరావు, తదితరులు

ఘనంగా భగీరథ జయంతి

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగీరథ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పరిపాలనాధికారి మాట్లాడుతూ సగరుల కులదైవం భగీరథ మహర్షి కఠోరమైన దీక్షతో దివి నుంచి భువికి గంగను తీసుకొని వచ్చారని, ఎవరైనా కష్టపడి పట్టుదలతో అనుకున్నది సాధిస్తే వారిని భగీరథునితో పోలుస్తారని, కఠోర శ్రమ చేసి దేన్నైనా సాధిస్తే భగీరథ ప్రయత్నం చేశాడని కొనియాడుతారన్నారు. భగీరథ మహర్షి జయంతి సందర్భంగా సగర కులస్తులకు శుభాకాంక్షలు తెలిపారు. భగీరథుని స్ఫూర్తితోనే ప్రభుత్వం సాగునీటి రంగాన్ని ప్రాధాన్యతగా తీసుకుందన్నారు. భగీరథ మహర్షి జయంతిని అధికారిక ఉత్సవంగా నిర్వ హించడం మన సంస్కృతిపై ఉన్న గౌరవానికి నిదర్శనమన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి రమేష్ మాట్లాడుతూ భగీరథుని కృషి ఆయన పట్టుదల, మనందరికీ స్ఫూర్తిదాయకమన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయ శ్రీనివాస ప్రాంగణంలో శ్రీ వకుళ మాత అన్నదాన భవన నిర్మిస్తున్నారు. దీని నిర్మాణానికి ఆదివారం కాతేరుకు చెందిన వెంకటేష్,ప్రణవి చౌదరి, వారి కుటుంబ సభ్యులు రూ.50,116 విరాళాన్ని ఆలయ డిసి నల్లం సూర్య చక్రధరావుకు అందజేశారు.

దస్తావేజులు పడి పోయినవి

తూర్పు గోదావరి జిల్లా, కొవ్వూరు మండలం, కొవ్వూరు పట్టణానికి చెందిన వర్రే నాగ మురళి కృష్ణ గారి భార్య శిరీష, door No.1-2-10/3 అయిన నేను, నా భర్త ది.30.04.2025 తారీకున మా ఇంటి నుండి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు కు మోటారు సైకిలు పై వెళ్ళుచుండగా మా Bag మరియు అందులో వర్రే సుభాషిని పేరున గల కొవ్వూరు ఆస్తికి సంబందించిన ది.08.12.2011 తేదీ గల ఒరిజినల్ క్రీయ దస్తావేజు నెంబర్ 5014/2011 పోయినది. సదరు Bag మరియు దస్తావేజు ఎవరికైనా దొరికినచో మాకు అప్పగించవలసినదిగా కోరడమైనది. దొరికిన వారికి తగిన బహుమానము ఇవ్వగలము.

వర్రే శిరీష, భర్త: నాగ మురళి కృష్ణ.
డోర్ నెంబర్ 1-2-10/3 వినాయక గుడి దగ్గర,
మేరకవీది, కొవ్వూరు
Cell No: 9491140267. 9493713836.

దస్తావేజులు పోయినవి

కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం ఏలేశ్వరం గ్రామానికి చెందిన తాతపూడి సురేష్ తండ్రి వెంకటరావు అనే నాకు సర్వే నెంబర్ 176 డోర్ నెంబర్ 18-16-324 లో చగ 155.10 లు ఖాళీ నివేసన స్థలం అందలి ఆర్ సి సి బిల్డింగ్ ది 12-07-2021 తేదీన నా తండ్రి గారు అయిన తాతపూడి వెంకట్రావు అనువారు నుండి సెటిల్మెంట్ దస్తావేజు రీత్యా పొంది ప్రత్తిపాడు రిజిస్టర్ కార్యాలయంలో 3840/2021 గా రిజిస్టర్ చేసుకోవడం జరిగింది. సదరు దస్తావేజు 19-04-2025 వ తేదీన ఏలేశ్వరం లోని మా ఇంటి నుండి బాలాజీ చౌక్ సెంటర్ కు జిరాక్స్ నిమిత్తం మోటార్ సైకిల్ పై తీసుకొనిరాగ పోయినది. నా యొక్క 3840/2021 నంబర్ గల దస్తావేజులు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

తాతపూడి సురేష్ S/o వెంకట్రావు,
డోర్ నెం:18-201,అంబేద్కర్ నగర్,
ఏలేశ్వరం గ్రామం, ఏలేశ్వరం మండలం,
కాకినాడ జిల్లా, పిన్:533429.
సెల్:9676781337.